మినీ కథ

# ఇదేమిటి?

మల్లారెడ్డి, రత్నమాలా రంగారావు

సంతకాలు పెట్టడం పూర్తిచేసి, మెడలో దండవేస్తూ, సుశీల కళ్ళల్లోకి సూటిగా చూశాడు సుబ్రమణ్యాం.

సుశీల కళ్ళు వాల్చుకుని క్రింది చూపులు చూస్తోంది.

చిపుక్కుమంది సుబ్రమణ్యానికి!

"ఈ నిముషం నుండీ మనిద్దరం ఒక్కటే! తోటలోని విడి విడి పూలన్నీ ఏరి ఒక్క దండలో బంధించినట్లు మనిద్దరం ఒకరి కొకరం అందమైన బందీలం. కష్టసుఖాలు ఇద్దరమూ కలిసే పంచుకుందాం...." ఇలా ఎన్నో బాసలు, వూహలు తన తొలిచూపులోనే అందిద్దామని కలలు కన్నాడతను పెళ్ళికాక ముందు. సర్ది చెప్పుకున్నాడు తనలో.

సిగ్గేమో! లేకపోతే తల్లి దండ్రులను విడిచి వచ్చేస్తున్నాననే బెంగేమో! అవును మరి! వివాహమనేది లాటరీలాంటిది. ఎన్నో మధురమైన వూహలతో, ఆశలతో పెళ్ళిళ్ళు చేసుకుని ఘోరంగా మోసపోయి జీవితాలు అంతం చేసుకున్నవాళ్ళు, ఛస్తూ బ్రతుకుతున్నవాళ్ళు ఎందరు లేరు?

స్త్రీలే కాదు. పురుషుడికీ వివాహం ఒక ముఖ్యమైన మలుపే. తన మట్టుకు తనకు ఈ పెళ్ళి పునర్జన్మే.

చిన్నప్పుడు జబ్బుచేసి ఫిట్స్ రావటం, దాని మీదట వళ్ళంతా మచ్చలుగా వచ్చి అవి స్థిరపడిపోవడంతో తన బ్రతుకు మీద తనకే ఆశ నశించిపోయింది. ఏదో మందులు వాడకం వలన ఫిట్స్ రావడం తగ్గిపోయినా అంటు వ్యాధి కాకపోయినా శరీరం మీద మచ్చలను ఏ డాక్టరూ తుడిచెయ్యలేకపోయాడు. ఏదో జీవితం వెళ్ళబుచ్చుకోవటానికి ఆధారం దొరికే తరుణంలో సంవత్సరం తేడాలో అమ్మ నాన్న తనని ఒంటరివాడిని చేసి వెళ్ళిపోతే, ఇక తానెవరి కోసం బ్రతకాలి అని కుమిలిపోయాడు? అంద కోసం వివాహం చేసుకుందామంటే! శరీర ఆరోగ్య పరిస్థితి తెలిసి పిల్లనెవరిస్తారు? అనే బాధ! సిగ్గు!!

ఇటువంటి పరిస్థితిలో సుశీల అన్నయ్య కృష్ణతో పరిచయం కావటం, అతను తనంత తానుగా తన చెల్లెల్ని వివాహం చేసుకోమని కోరటం నిజంగా తన జీవితానికో పెద్ద మలుపే.

"అదేమిటి బావగారూ! ఇంతలోనే పరధ్యానంలో పడిపోయారు? పదండి ఇంటికి వెళదాం" కృష్ణ పరాచిక మాడాడు.

ఆ రోజు రాత్రి—

శోభనం గదిలో, స్వచ్ఛమైన మల్లెపువ్వులాంటి చీర, పాలగ్లాసుతో అడుగు పెట్టిన సుశీలలో అతనికి దైవత్వం కనిపించింది. తెలియని వుద్వేగం చోటు చేసుకుందతనిలో.

"సుశీలా!" ఆరాధనగా పిలిచాడతను.

"నువ్వు నా చీకటి జీవితానికి అంతులేని జ్యోతివి. జీవించటానికే అర్హతలేని నాకు నూతన జీవితం ప్రసాదించడానికి వచ్చిన ప్రేమస్వరూపిణివి నువ్వు. నీ సౌందర్యంతో నా జీవితానికో అర్థం చెప్పనున్న దేవతవు నువ్వు...." ఆవేశంగా చెప్పుకుపోతున్నాడతను.

"....నీ దగ్గర నా గురించి దాచి అబద్ధపు బ్రతుకు మొదలుపెట్టలేను....నాకున్న వ్యాధి సంగతి నీకు తెలుసుగా! ఇటువంటప్పుడు మనకి పుట్టబోయే పిల్లలకు కూడా ఇది సంక్రమించి వాళ్ళనుభవించబోయే బాధను చూసే శక్తిలేక, మనకి పిల్లలు పుట్టకుండా ఆపరేషను చేయించుకున్నాను సుశీలా! పెళ్ళి అయిన దగ్గర నుండి మాతృత్వం ఎప్పుడెప్పుడా అని ప్రతి స్త్రీ కలలు కంటుందట....భవిష్యత్తును భరించలేక....నన్ను క్షమించవూ........

సుశీలకు మరి తరవాత మాటలు వినిపించ లేదు. పక్కలో బాంబు పేలినట్లు వులిక్కిపడి నిటారుగా అయిపోయింది.

ప్రేమించి, నెల తప్పిందని తెలియగానే మోసంచేసి పరారయిపోయాడు మోహన్. చావలేక, మరో గత్యంతరం లేక, తన కడుపులోని బిడ్డకో తండ్రి కావాలని ఈ పెళ్ళి చేసుకుంటే, ఇదేమిటి? □

సీరియల్




సినిమా హాల్లోనే రాజేంద్రకి తలపోటు ప్రారంభమయింది. ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చున్నాడు.